క్లుప్తంగా

శబరిమలకు పాదయాత్రగా స్వాములు



ఇరుముడితో అయ్యప్ప స్వాములు తదితరులు

అనంతగిరి: వికారాబాద్‌కు చెందిన పలువురు అయ్యప్ప స్వాములు గురువారం హనుమాన్ మందిరంలో ఇరుముడి కట్టుకుని పాదయాత్రగా శబరిమలకు బయలుదేరారు. శబరిమలకు వెళ్లిన వారిలో గురుస్వాములు కారంపాడి వెంకట్, రాకేశ్, శ్రీనివాస్‌గౌడ్, సాయికృష్ణ, శ్రీనివాస్ ఉన్నారు. వీరు శబరిమలకు చేరేందుకు 40 రోజులకు పైగా పడుతుందని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో గురుస్వామి రవి పంతులు, నాగేందర్‌రెడ్డి, దీపక్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

ఉత్తమ ఫలితాలు సాధించాలి

- ఎస్‌ఐ యాదగిరి
- పదోతరగతి పరీక్షలపై అవగాహన



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ యాదగిరి

దుద్యాల్: విద్యార్థులు పదోతరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించాలని ఎస్‌ఐ యాదగిరి పేర్కొన్నారు. గురువారం దుద్యాల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు పరీక్షలపై అవగాహన కల్పించారు. పరీక్ష కేంద్రంలో భయపడకుండా వచ్చిన సమాధానాలను ముందుగా రాయాలన్నారు. చదివింది గుర్తుంచుకోవాలన్నారు. నిత్యం పాఠశాలలో ఉపాధ్యాయులు చెప్పింది క్రమశిక్షణతో నేర్చుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కానిస్టేబుల్‌లు రవితేజ, కృష్ణ, శంకర్, పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

పదోన్నతి హర్షణీయం



ఆర్డీవోకు శుభాకాంక్షలు తెలిపిన సిద్ధాంతి పార్థసారథి

పరిగి: ఆర్డీఓ వాసుచంద్రాకు డిప్యూటీ కలెక్టర్‌గా పదోన్నతి రావడం హర్షణీయమని పరిగి లక్ష్మీవేంకటేశ్వర స్వామి ఆలయ చైర్మన్ సిద్ధాంతి పార్థసారథి పేర్కొన్నారు. గురువారం జిల్లా ఆర్డీఓ కార్యాలయంలో ఆయనను కలిసి శాలువ కప్పి, సన్మానించి అభినందించారు. ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉండే అధికారులకు పదోన్నతులు రావడం సంతోషకరవిషయమన్నారు. ఏ ప్రాంతంలో విధులు నిర్వహించినా కీర్తి గడించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ లింగం, కాంగ్రెస్ నేతలు వెంకటేశ్, కుదుముల వెంకటేశ్, సిద్ధాంతి అభిరామ్ పాల్గొన్నారు.

పోషకాహారం తీసుకోవాలి

కోట్‌పల్లి తహశీల్దార్ శ్రీనివాస్



మాట్లాడుతున్న తహశీల్దార్ శ్రీనివాస్

బంట్వారం: గర్భిణులు, బాలింతలు తప్పనిసరిగా పోషకాహారం తీసుకోవాలని కోట్‌పల్లి తహశీల్దార్ శ్రీనివాస్ సూచించారు. గురువారం మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ మాసోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన హాజరై మాట్లాడారు. ఆరోగ్యకరమైన జీవితానికి ఆకుకూరలు. కూరగాయలు నిత్యం భోజనంలో ఉండాలన్నారు. ఎంఈఓ చంద్రప్ప, సీహెచ్‌ఓ ఖయ్యూం, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ధనలక్ష్మి, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

రేపు జోనల్‌స్థాయి ఖోఖో టోర్నమెంట్

చేవెళ్ల: ఈ నెల 18వ తేదీన చేవెళ్లలోని ఆదర్శ పాఠశాల గ్రౌండ్‌లో శంకర్‌పల్లి జోనల్ స్థాయి 69వ స్కూల్ గేమ్ ఫెడరేషన్(ఎస్‌జీఎఫ్) ఖోఖో టోర్నమెంట్ పోటీలు, సెలక్షన్‌లు జరుగుతాయని జోనల్ కార్యదర్శి ప్రభాకర్ తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. 69వ ఎస్‌జీఎఫ్ జోనల్‌స్థాయి టోర్నమెంట్‌లో భాగంగా ఖోఖోపోటీలు చేవెళ్లలో నిర్వహిస్తామన్నారు. ఈ పోటీలు చేవెళ్ల, శంకర్‌పల్లి ఎంఈఓలు పురన్‌దాస్, అక్బర్ ఆధ్వర్యంలో కొనసాగుతాయని తెలిపారు. రెండు మండలాల్లోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు టోర్నమెంట్‌లో పాల్గొనవచ్చని, ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను జిల్లా స్థాయికి ఎంపిక చేస్తామని వెల్లడించారు.

పారిశుద్ధ్యం.. అస్తవ్యస్తం!

- ఏరులైపారుతున్న మురుగు
- దుర్వాసనతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న స్థానికులు
- పట్టించుకోని అధికారులు



పరిగి: నాల్గో వార్డులో ఇళ్ల మధ్య పేరుకుపోయిన మురుగు

పరిగి: పట్టణ కేంద్రంలో పారిశుద్ధ్యం అస్తవ్యస్తంగా తయారైంది. కాలనీల్లో మురుగు నీరు ఏరులై పారుతుంది. దీంతో కాలనీ వాసులు నానా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ విషయం గురించి పట్టించుకునే అధికారులు కరువయ్యారు. పట్టణ పరిధిలోని నాల్గో వార్డులో రెండు నెలలుగా మురుగు నీరు పారుతున్నా అధికారులు కన్నెత్తి చూడడం లేదు. పారిశుద్ధ్య చర్యలూ చేపట్టడం లేదని కాలనీ వాసులు మండిపడుతున్నారు. మురుగుతో పాటు డ్రైనేజీలనుంచి దుర్వాసన వెదజల్లడంతో ఉండలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పలు మార్లు సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినా తమకేమి సంబంధం లేనట్టుగా వ్యవహరిస్తున్నారని చెబుతున్నారు. ఇప్పటికైనా ఈ విషయంలో సంబంధిత అధికారులు స్పందించి పారిశుద్ధ్యంపై శ్రద్ధ తీసుకోవాలని, డ్రైనేజీ కంపును తొలగించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

మురుగు.. పరుగు!

దుద్యాల్: మండల పరిధిలోని కుదరుమల్ల, గౌరారం గ్రామాల్లో రోడ్లపై మురుగు పారుతున్నా పట్టించుకునే నాదుడే కరువయ్యారని గ్రామస్తులు వాపోతున్నారు. రెండు గ్రామాల్లో ఆంజనేయ స్వామి దేవాలయం ఎదురుగానే మురుగు చేరి పారడంతో ఆలయాలకు వచ్చే భక్తులు, స్థానికులు ఇబ్బందులకు గురవుతున్నారు. అంతేకాకుండా అక్కడినుంచి వెళ్తుంటే దుర్గంధం వెదజల్లుతుందని పలువురు చెబుతున్నారు. మురుగు చేరడం వల్ల దోమలు, ఈగలు వ్యాపించి వ్యాధుల బారిన పడుతున్నట్లు ఆయా గ్రామాల ప్రజలు వివరించారు. తక్షణమే అధికారులు ఈ విషయంపై స్పందించి రోడ్డుపై పారుతున్న మురుగు నీటిని తొలగించాలని కోరుతున్నారు.



దుద్యాల్: గౌరారంలో ఆంజనేయ స్వామి దేవాలయం సమీపంలో రోడ్డుపై చేరిన మురుగు



దుద్యాల్: కుదురుమల్లలో ఆంజనేయ స్వామి దేవాలయం ఎదుట పారుతున్న మురుగు నీరు

క్యాద్గీరా కార్యదర్శిని కొనసాగించాలి

డిప్యుటేషన్ రద్దు చేయాలని సబ్ కలెక్టర్, డీపీఓకు గ్రామస్తుల వినతి



డీపీఓకు వినతిపత్రం అందజేస్తున్న క్యాద్గీరా, గంగ్వార్ గ్రామస్తులు

బషీరాబాద్: క్యాద్గీరా పంచాయతీ కార్యదర్శి శృతిని బదిలీ చేయొద్దని, కొనసాగించాలని గ్రామస్తులు ఆందోళన బాట పట్టారు. గురువారం గ్రామస్తులు పెద్ద ఎత్తున సంతకాలు సేకరించి సబ్ కలెక్టర్ ఉమా శంకర్, డీపీఓ జయసుధకు వినతిపత్రం అందజేశారు. గ్రామంలో సమస్యలు పరిష్కరిస్తూ సర్పంచులేని లోటు తీరుస్తూ అందరికి అందుబాటులో ఉండి పనిచేస్తున్న శృతిని భోజ్యానాయక్ తండాకు డిప్యుటేషన్‌పై ఎలా బదిలీ చేస్తారని అధికారులను గ్రామస్తులు ప్రశ్నించారు. గ్రామం అభివృద్ధి చెందాలంటే, సమస్యలు పరిష్కారం కావాలంటే ప్రస్తుత కార్యదర్శినే కొనసాగించాలని విజ్ఞప్తి చేశారు. లేదంటే పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో క్యాద్గీరా, గంగ్వార్ గ్రామస్తులు శ్యామప్ప, భీమప్ప, భీంరెడ్డి, పెద్ద లక్ష్మప్ప, రాజ సాయప్ప, జగ్గప్ప, ప్యాట్ల హన్మంత్ రెడ్డి, మానిక్ రెడ్డి, బోయిని రవి, బంటు అంబ్రేష్, బంటు రవి, మాల అంజిలప్ప, కిరణ్, మంతట్టి శీను తదితరులు పాల్గొన్నారు.

దీపోత్సవానికి జానపద కళా బృందం

అయోధ్య చేరుకున్న తెలంగాణ కళాకారులు



అయోధ్యలో జానపద కళాబృందం

బొంరాస్‌పేట: శ్రీరామ జన్మభూమి అయోధ్య యోగ్‌లో ఈ నెల 17నుంచి 19వరకు నిర్వహించనున్న ×దీపోత్సవం–2025॰ కార్యక్రమానికి తెలంగాణ కళాకారులు గురువారం అయోధ్య చేరుకున్నారు. తెలంగాణ జానపద కళలను ప్రదర్శించేందుకు కళాకారులతో వచ్చినట్లు మాస్టర్ ఆర్. ప్రకాశ్ తెలిపారు. బోనాల ప్రదర్శన ఇవ్వనున్నట్లు ఆయన పేర్కొన్నారు. మూడు రోజుల పాటు ప్రదర్శనలు ఇస్తామని, బృందంలో 15మంది ఉన్నట్లు వివరించారు. కళాబృందం సభ్యులు కృష్ణయ్య, రమేశ్‌మాస్టర్, మనీషా యాదవ్, చిన్నారి, శ్రావణి, నికిత, అనూష, బుగ్గేష్, సిద్ధు, నిఖిల్ యాదవ్, బ్రహ్మేంద్ర ఉన్నారని పేర్కొన్నారు.

రోడ్డుకు మరమ్మతులు

మొయినాబాద్: ఎవరో వస్తారు.. ఏదో చేస్తారు.. అని ఎదురుచూడకుండా తమ ఊరి గుంతల రోడ్డును యువకులే స్వచ్ఛందంగా ముందుకొచ్చి బాగుచేసుకున్నారు. సొంత డబ్బులతో కాంక్రీట్ వేయించి గుంతలు పూడ్చారు. మున్సిపాలిటీ పరిధిలోని పెద్ద మంగళారం రోడ్డు పూర్తిగా గుంతలమయంగా మారడంతో వాహనదారులు, స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మరమ్మతులు చేయించాలని అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా స్పందించకపోవడంతో గ్రామ యువకులే రోడ్డు బాగుచేసుకోవడానికి నడుం బిగించారు. సొంత డబ్బుల తో రోడ్డుపై ఏర్పడిన గుంతలను పూడ్చారు. బందారు ఓంరెడ్డి, సరికొండ వీరారెడ్డి, మందడి రాఘవరెడ్డి, అబీబ్‌ఖాన్, చేగూరి ఆనంద్‌గౌడ్ పాల్గొన్నారు.

సీసీ కెమెరాలతో నేరాలు అదుపు

దాత గోపి నాయక్

దుద్యాల్: సీసీ కెమెరాలతో నేరాలు అదుపు చేయొచ్చని గ్రామస్తుడు గోపి నాయక్ పేర్కొన్నారు. చిలుముల మైల్వార్ గ్రామంలో గురువారం సీసీ కెమెరాలు ఏర్పాటు చేయించారు. ఈ సందర్భంగా గోపినాయక్ మాట్లాడారు. గ్రామంలో సీసీ కెమెరాల ఏర్పాటుతో గ్రామానికి రక్షణ ఉంటుందన్నారు. దోపిడీ, దాడులు సంభవించినప్పుడు నిందితులను సులువుగా పట్టుకోవచ్చన్నారు. ఎవరైనా అనుమానాస్పద వ్యక్తులు చొరబడితే వారిని సులభంగా గుర్తించేందుకు ఇవి ఉపయోగపడుతాయని పేర్కొన్నారు. గ్రామంలో ఏర్పాటు చేసేందుకు సహకరించిన అతనిని గ్రామస్తులు అభినందించారు. ఈ కార్యక్రమంలో కానిస్టేబుల్ శంకర్ పాల్గొన్నారు.



ఏర్పాటు చేయించిన సీసీ కెమెరాల వద్ద గోపినాయక్, కానిస్టేబుల్ శంకర్

ఇందిరమ్మ ఇళ్లను త్వరగా నిర్మించుకోవాలి



కుల్కచర్ల: కామునిపల్లిలో నిర్మాణ పనులు పరిశీలిస్తున్న అధికారులు

ఎంపీడీఓ గ్యామా

దోమ: ఇందిరమ్మ ఇళ్లను త్వరగా నిర్మించుకోవాలని ఎంపీడీఓ గ్యామా సూచించారు. గురువారం దోమ మండల పరిధిలోని రాకొండ గ్రామంలో లబ్ధిదారుల ఇళ్లను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ప్రభుత్వం పేదల సంక్షేమం కోసం కృషి చేస్తుందన్నారు. ఎన్నో పథకాలను తీసుకువచ్చి అమలు చేస్తుందన్నారు. వాటిని అర్హులు సద్వినియోగించుకోవాలన్నారు. ఇళ్ల నిర్మాణ బిల్లులు సైతం వెంటనే లబ్ధిదారుల ఖాతాల్లో జమఅవుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రవికుమార్, ఫీల్డ్ అసిస్టెంట్ వెంకటయ్య, ఇందిరమ్మ కమిటీ గ్రామ అధ్యక్షుడు వెంకటయ్య, మాజీ సర్పంచ్ చాపల వెంకటయ్య, గ్రామస్తులు చంద్రయ్య, శ్రీనివాస్, లక్ష్మయ్య, తదితరులు పాల్గొన్నారు.

నిర్మాణ పనులు వేగవంతం చేయాలి



పనులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ రామకృష్ణ

కుల్కచర్ల: ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులు వేగవంతం చేయాలని హౌసింగ్ పీడీ దశరథ్ సింగ్ రాథోడ్, డీఈ సయ్యద్ ముక్రం బాబ, కుల్కచర్ల మార్కెట్ కమిటీ చైర్మన్ ఆంజనేయులు పేర్కొన్నారు. గురువారం కామునిపల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణ పనులు వేగంగా చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షుడు భీంరెడ్డి, ఎంపీడీఓ రామకృష్ణ, కాంగ్రెస్ మండల ప్రధాన కార్యదర్శి గోపాల్ నాయక్, గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడు మోర వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి వాలీబాల్‌కు ఎంపిక



ముజాహిద్‌పూర్ మోడల్ స్కూల్లో విద్యార్థినిని సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

కుల్కచర్ల: వాలీబాల్ ఎంపిక పోటీల్లో ముజాహిద్‌పూర్ మోడల్ స్కూల్ విద్యార్థిని నిత్యశ్రీ., సాలీడు గ్రామానికి చెందిన లావణ్య, సింధు ఎంపికయ్యారు. బుధవారం రంగారెడ్డి జిల్లా కుషాయిగూడలో నిర్వహించిన క్రీడా పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారని ఉపాధ్యాయులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా గురువారం ఆయా పాఠశాలలలో విద్యార్థులను ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించి అభినందించారు.

గాలికుంటు వ్యాధి నివారణకు చర్యలు

బొంపల్లి పశువైద్య అధికారి స్వప్న

దోమ: గాలికుంటు వ్యాధి నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని బొంపల్లి పశువైద్య అధికారి స్వప్న పేర్కొన్నారు. గురువారం దోమ మండల పరిధిలోని బొంపల్లి పశువైద్య సబ్ సెంటర్‌లో వ్యాధి నివారణకు వ్యాక్సిన్ కంపౌండర్ బాబయ్యతో కలిసి ఆమె వేశారు. ఈ సందర్భంగా స్వప్న మాట్లాడుతూ..గాలికుంటు వ్యాధి సోకిన పశువుల్లో పాల ఉత్పత్తి గణనీయంగా తగ్గుతుందని తెలిపారు. ముఖ్యంగా పశువులు జ్వరం, అనారోగ్యానికి గురవుతుంటాయని, వ్యాధి నివారణకు టీకాలను వేయడంతో కోలుకుంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ రైతులు ఆర్. నర్సింహారెడ్డి, యాదయ్య, రాములు, గఫార్, జోరద్దీన్, బాలయ్య, తదితరులు పాల్గొన్నారు.

పూడూరు: రైతులు తప్పనిసరిగా పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయించాలని జిల్లా పశుసంవర్ధక శాఖ సహాయ సంచాలకులు డాక్టర్ విజయలక్ష్మి తెలిపారు. వ్యాధి నివారణలో భాగంగా మండల పరిధిలోని అంగడిచిట్టంపల్లి, మన్నెగూడ, పూడూరు, చన్గోముల్ గ్రామాల్లోని పశువైద్య కేంద్రాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వాతావరణ మార్పుల కారణంగా పశువులు రకరకాల వ్యాధుల భారిన పడతాయన్నారు. పశువుల ఆరోగ్యం పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పూడూరు వైద్యాధికారి సుజాత్‌అలీ, సిబ్బంది గోపాల్, రైతులు తదితరులు పాల్గొన్నారు.



తాండూరు రూరల్: గోశాలలో టీకా కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న డాక్టర్ సదానందం

కుల్కచర్ల: వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని మండల పశువైద్యాధికారి అఫ్రీన్ ఫాతిమా అన్నారు. పుట్టపహాడ్ గ్రామంలో రైతుల పొలాల వద్దకు వెళ్లి టీకాలు వేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..పశువులకు ఎటువంటి వ్యాధులు సోకిన పశువైద్యాధికారుల సూచనలకు అనుగుణంగా వైద్యం చేయించాలని పేర్కొన్నారు.

టీకాలు ఇప్పించండి: డాక్టర్ సదానందం

తాండూరు రూరల్: టీకాలు ఇప్పించాలని జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి డాక్టర్ సదానందం పేర్కొన్నారు. తాండూరు పట్టణంలోని గోశాలలో గాలికుంటు వ్యాధి టీకాల కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గాలికుంటు వ్యాధి ఒక అంటువ్యాధి అని పేర్కొన్నారు. ఈ వ్యాధి సోకితే పశువులకు నోటి నుంచి చొంగ కారి, పాల దిగుబడి గణనీయంగా తగ్గిపోతుందన్నారు. కావున ప్రతీ రైతు తప్పనిసరిగా టీకాలు వేయించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు శివదుర్గా ప్రసాద్, డాక్టర్ నాన్సి, అసిస్టెంట్ వెటర్నరీ అశోక్, ఆఫీస్ సబార్డినేటర్ ఇమ్రాన్ పాల్గొన్నారు.



పూడూరు: చన్గోముల్‌లో గేదెలకు టీకాలు వేస్తున్న పశువైద్యాధికారులు

యువకుల శ్రమదానం



శ్రమదానంతో గుంతలు పూడుస్తున్న యువకులు

బంట్వారం: ఎవరో వస్తారని..ఏదో చేస్తారని ఎదురు చూడకుండా యువకులు శ్రమదానం నిర్వహించి గుంతలు పూడ్చారు. వివరాలు ఇలా ఉన్నాయి.. వికారాబాద్, కోట్‌పల్లి ఆర్‌అండ్‌బీ రోడ్డుపై ఏర్పడిన గుంతలను గురువారం పూడ్చి వాహనదారులు, స్థానికులతో శభాష్ అనిపించుకున్నారు. జాంబాపూర్ తండా నుంచి గిరిగెట్‌పల్లి వరకు గుంతలుగా మారిన రోడ్డుకు మరమ్మతులు చేశారు. ఈ కార్యక్రమంలో మైలార్‌దేవరంపల్లి ఆటో యూనియన్ నాయకులు రత్నం, ఆనంద్, రాజు, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన

శంకర్‌పల్లి: మండల పరిధిలోని గోపులారంలో మాజీ సర్పంచ్ పొడువు శ్రీనివాస్ ఆధ్వర్యంలో గురువారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో హైదరాబాద్‌కి చెందిన హ్యాపీ విజన్ లేజర్ కంటి ఆస్పత్రి వైద్యులు పరీక్షలు నిర్వహించగా.. గ్రామస్తుల నుంచి పెద్దఎత్తున స్పందన లభించింది. ఈ సందర్భంగామహిళలు, వృద్ధులు కంటి పరీక్షలు చేయించుకున్నారు. వైద్యులు అవసరమైన వారికి ఉచితంగా మందులు అందించారు.

సీపీఆర్‌పై అవగాహన తప్పనిసరి



మోమిన్‌పేట ఆస్పత్రిలో సీపీఆర్ చేస్తున్న కృష్ణ

మోమిన్‌పేట: సీపీఆర్‌పై తప్పనిసరిగా అవగాహన కలిగి ఉండాలని 108 ఈఎన్‌టీ కృష్ణ పేర్కొన్నారు. గురువారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సీపీఆర్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అత్యవసర పరిస్థితిలో ప్రాణాలు కాపాడేందుకు ప్రతిఒక్కరికి అవగాహన అవసరమన్నారు. గుండె ఆగిపోయిన వ్యక్తికి అత్యవసరంగా చేయాల్సిన ప్రాణరక్షణ చర్యలను ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌ఓ శకుంతల, పీహెచ్‌ఎం ధనవతి, 108 పైలెట్ జావిద్, 102 పైలెట్ తాజోద్దీన్ తదితరులు ఉన్నారు.

కుల్కచర్లలో..



కుల్కచర్ల:అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారులు

కుల్కచర్ల: ప్రతిఒక్కరూ సీపీఆర్‌పై అవగాహన పెంచుకోవాలని కుల్కచర్ల మండల వైద్యాధికారి కిరణ్ గౌడ్ పేర్కొన్నారు. గురువారం ముజాహిద్‌పూర్ ప్రభుత్వ మోడల్ స్కూల్లో, బాలుర జెడ్పీ పాఠశాలలో అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..గుండె సంబంధిత నొప్పి వచ్చినప్పుడు అప్పటికప్పుడు సీపీఆర్ చేయడం ద్వారా వ్యక్తి ప్రాణాలను కాపాడవచ్చన్నారు. ఎదుటివ్యక్తికి గుండెనొప్పి వచ్చినప్పుడు నోటి ద్వారా నొప్పివచ్చిన వ్యక్తికి శ్వాసను అందించడంతో అతడి శ్వాసనాళాలు పున:రుజ్జీవాన్ని పొందుతాయని సూచించారు. ఈ కార్యక్రమంలో 108 జిల్లా కోఆర్డినేటర్ అబ్దుల్ రహీం, ఈఎంటీ వినోద్ కుమార్, చంద్రశేఖర్, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ జ్యోతి హెప్సిభా తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారం వడ్డించాలి

ఎంపీడీవో రామకృష్ణ



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న ఎంపీడీవో రామకృష్ణ

కుల్కచర్ల: విద్యార్థులకు ప్రతిరోజు పౌష్టికాహారం వడ్డించాలని కుల్కచర్ల ఎంపీడీఓ రామకృష్ణ పేర్కొన్నారు. గురువారం కుల్కచర్ల మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల ఆశ్రమ పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మధ్యాహ్న భోజన విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించొదన్నారు. విద్యార్థులకు పోషకాహారం ఇస్తేనే ఆరోగ్యంగా ఉండి చదువుపై దృష్టి సారిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో కేజీబీవీ ప్రత్యేకాధికారి దేవి, తదితరులు పాల్గొన్నారు.